క్లుప్తంగా

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : జిల్లాలో వరిపంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. బుధవారం మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యం లో సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బీఎస్.లతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల, ప్రాజెక్టుల నుంచి కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందక పంటలు ఎండిపోయాయని అన్నారు. అప్పుల పాలైన రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కలెక్టర్ స్పందించి జిల్లాలో ఎండిన వరిపంటలను సర్వే చేసి అర్హులైన రైతులకు ఎకరానికి రూ.35 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వీరబోయిన రమేష్, పీఓడబ్ల్యూ జిల్లా సహాయ కార్యదర్శి సూరం రేణుక తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్యపరీక్షలు

ఆత్మకూర్ (ఎస్) : గర్భిణులు, బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్లు వి.సురేష్, రాంప్రసాద్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా పిల్లలను ఎండలో తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్టు కె.సాయిశ్రీ, ఏఎన్ఎం కె.అమల, అంగన్‌వాడీ టీచర్లు ఎండీ.ఎగ్బాల్ బేగం, బి.శారద, ఏ.జానమ్మ, ఆయాలు శోభ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం



దామోదర్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డిలకు ఆహ్వానం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అర్వపల్లి : మండల పరిధిలోని అడివెంల గ్రామ ఎస్సీకాలనీలో వచ్చే నెల 5 నుంచి 7 వరకు ముత్యాలమ్మ దేవత ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేటలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ నాయకుడు సర్వోత్తంరెడ్డిలకు ఆహ్వానపత్రికలను అందజేశారు. ఉత్సవాలకు తప్పక హాజరు కావాలని కోరినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పేరెల్లి ఉపేందర్, పేరెల్లి లింగయ్య, శతకోటి సైదులు, బొర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్డీఆర్ పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు సయ్యద్ షాబోద్దీన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిలు బుధవారం పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, గజ్జెల సైదిరెడ్డి, గొర్ల అంజయ్య, సురేందర్ రెడ్డి, మామిడి శ్రీనివాస్, పరశురాములు, జానిమియా, సైదిరెడ్డి, ఉస్మాన్ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన

నూతనకల్ : పల్లె ప్రకృతి వన నర్సరీ కేంద్రాల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన రాజు కోరారు. బుధవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, వన నర్సరీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొక్కల సంరక్షణకు నీటి ఎద్దడి ఏర్పడినట్లయితే ప్రత్యేక చర్యలు చేపట్టి నీటి సదుపాయాన్ని సమకూర్చాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి శర్మ పాల్గొన్నారు.

ప్రకృతి వనాల్లో కరువైన పచ్చదనం

- వేసవిలో నీళ్లు చాలక నర్సరీలు, వనాల్లో ఎండిపోతున్న మొక్కలు
- కొరవడిన నిర్వహణ

అర్వపల్లి : పల్లెలు పచ్చదనంతో ఉండటానికి ప్రతి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం గతంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. 2020లో ఈ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే వారికి, స్థానికులు సాయంత్రం వేళ ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు వీటిని ఏర్పాటు చేశారు. మొన్నటి వరకు పచ్చదనంతో కళ కళ లాడిన పల్లె ప్రకృతి వనాలు సరైన నిర్వహణ లేకపోవడం, వేసవిలో నీళ్లు చాలకపోవడంతో మొక్కలు ఎండిపోయి అధ్వానంగా మారాయి.

జాజిరెడ్డిగూడెం మండలంలో..

జాజిరెడ్డిగూడెం మండలంలో ఉపాధిహామీ పథకం నందు 2020లో 30 పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వనాలకు సంబంధించి ఆయా గ్రామాల్లో సేకరించిన స్థలాలను బట్టి 500 నుంచి 2000 వరకు మొక్కలు నాటారు. ఒక్కో నర్సరీకి రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇంతకు మించి కూడా కొన్ని చోట్ల బడ్జెట్ కేటాయించి పనులు చేపట్టారు. వీటిలో వివిధ రకాల మొక్కలు నాటారు. వాటి సంరక్షణ 2020 మార్చి వరకు ఉపాధిహామీ పథకంలో చేపట్టారు. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు పల్లె ప్రకృతి వనాలను అప్పగించారు. దీంతో గ్రామ పంచాయతీలే ప్రకృతి వనాల నిర్వహణ చూస్తున్నాయి. అయితే వేసవి కాలం కావడంతో ఎండలు తీవ్రమై మొక్కలు ఎండిపోతున్నాయి. అలాగే ప్రకృతి వనాలు పిచ్చి, కంపచెట్లతో నిండాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సరైన నిర్వహణ చేపట్టి మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పోయించాలని, ఆహ్లాదాన్ని పంచేలా ప్రకృతి వనాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



సీతారాంపురంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోతున్న మొక్కలు



అస్తవ్యస్తంగా ఉన్న సీతారాంపురం పల్లె ప్రకృతి వనం



అర్వపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో మొలిచిన కంపచెట్లు



సీతారాంపురం పల్లె ప్రకృతి వనంలో చోరీకి గురైన డ్రెయినేజీ గేట్ పైపులు

పచ్చదనం కరువైంది



గతంలో ఉపాధిహామీ పథకంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ప్రస్తుతం పచ్చదనం కనిపించకుండా పోయింది. ఎండలతో గ్రామాల్లో నీటి సమస్య తీవ్రం కావడంతో ప్రకృతి వనాలకు సరిగా నీళ్లు అందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి.

– మచ్చ నర్సయ్య, సామాజిక ఉద్యమకారుడు

వనాలను సంరక్షించాలి



పల్లె ప్రకృతి వనాలను సంరక్షించాలి. మొక్కలకు నీళ్ల చాలక ఎండిపోతున్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పల్లె ప్రకృతి వనాలతో గ్రామాల్లో పచ్చని, ప్రశాంత వాతావరణం ఏర్పడుతుంది.

– బందెల వెంకన్న, సీతారాంపురం

ఫణిగిరిలో వైభవంగా రథోత్సవం



ఫణిగిరిలో ఊరేగింపుగా వెళ్తున్న రథం

నాగారం : నాగారం మండల పరిధిలోని ఫణిగిరిలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి రథోత్సవం, చక్రస్నానం, అగ్నిహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రథంలో ప్రతిష్ఠించి గ్రామంలోని పురవీధుల గుండా డప్పుచప్పుళ్లతో, కోలాటాలతో ఘనంగా ఊరేగించారు. స్వామివారికి భక్తులు టెంకాయలు సమర్పించి తమ, తమ మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారికి దూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, దేవాదాయశాఖ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు కె.సంతోష్ కుమార్ ఆచార్యలు, ఆలయ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని వినతి



నాగారంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డి.కొత్తపల్లి గ్రామస్తులు

నాగారం : నాగారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామ స్టేజీ వద్ద నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లకు సంబంధించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని బుధవారం లబ్ధిదారులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు డబుల్‌బెడ్ రూం ఇళ్లు మంజూరు చేసి నేటికీ లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వం వెంటనే పట్టాలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పడిశాల వెంకటేష్, దేవరకొండ వెంకన్న, దోమలపల్లి గోవర్ధన్, దందోలు మహేష్, ఎల్లయ్య, నర్సయ్య, రజిత పాల్గొన్నారు.

పాఠశాలకు వీల్‌చైర్ అందజేత

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని టేకుమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదే పాఠశాలలో బీఈడీ ట్రైనింగ్ చేస్తున్న కుమారి షారోన్ లిడియా తల్లిదండ్రులు సుమారు రూ.7500 విలువ చేసే వీల్‌చైర్‌ను బుధవారం ప్రధానోపాధ్యాయుడు దైద పాపయ్యకు అందజేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్యానాయక్, శోభాబాయి, అరుంధతి, ఉపేందర్, రమేష్, రామకృష్ణ, మల్లేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వేదాంత భజన మందిరంలో పూజలు



వేదాంత భజన మందిరంలో పసుపు పడుతున్న మహిళలు

భానుపురి : బొడ్రాయి బజార్‌లోని శ్రీ వేదాంత భజన మందిరంలోని శ్రీసీతారామచంద్ర స్వామి సన్నిధిలో ఏప్రిల్ 9 నుంచి 17 వరకు నిర్వహించే స్వామివారి కల్యాణ వసంత నవరాత్రోత్సవాలకు ప్రారంభ సూచికగా బుధవారం ఆలయంలో మహిళలతో పసుపు కొట్టించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ రాచర్ల వెంకటేశ్వరరావు మాట్లాడారు. ప్రతి ఏటా ఉగాదికి ముందు భక్తులు తెచ్చిన పసుపు కొమ్ములు స్వామివారి సన్నిధిలో కొడుతున్నట్లు తెలిపారు. ఆ పసుపును శ్రీ రామ నవమి వేడుకల్లో ఉపయోగించనున్నట్లు తెలిపారు. అంతకుముందు సీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కంకణ ధారణ కార్యక్రమం జరిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పసుపు దుస్తులు ధరించి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉప్పల లలిత ఆనంద్, మందిర ప్రధాన కార్యదర్శి నకిరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, కమిటీ సభ్యులు వీరవెల్లి రాంమూర్తి, పాలువాయి రవీందర్, సోమ సుమన్, శీలా శంకర్, యామ శ్రీనివాసులు, రాచర్ల ప్రేమలత, నకరికంటి హైమావతి, సోమ శోభ, కొత్తూరు స్వాతి, దేవాలయ అర్చకులు ధరూరి సింగరాచార్యులు, రాఘవాచార్యులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు భూమిపూజ



కుక్కడంలో భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు శంఖువుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయిని ప్రతిష్ఠించే ప్రాంతంలో గ్రామస్తులందరూ నవధాన్యాలను పోశారు. పసుపు, కుంకుమలను చల్లి కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి వేణు, గ్రామ పెద్దలు వల్లపు కళింగం, ముక్కాల అవిలమల్లు, కోడి శ్రీనివాస్, వల్లపు శ్రీనివాస్, మద్దెల రామనర్సు, మల్లయ్య, మద్దెల సోమయ్య, వెంకటవెల్లి వెంకటయ్య, మద్దెల భిక్షపతి, గంగదరి చంద్రయ్య, బీసు నాగయ్య, ఎల్లయ్య, మహేందర్, రవి, కాశీం, బింగి సోమయ్య, మద్దెల యాకయ్య, ముక్కాల వీరస్వామి, చలేంద్రచారి, నల్లగంటి పుల్లయ్య, సోమయ్య, అంజయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రుగొండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గరుడ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో శ్రీలక్ష్మీ నర్సింస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మొదటి రోజు స్వామి వారికి వేద పండితులు శ్రీమాన్ అరవింద చార్యులు, సుబ్రహ్మణ్య చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకురార్పణ, గరుడ హోమం, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బంధకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా ఆలయ పరిసరాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి అతి దగ్గరలో మద్యం షాపులు ఉండటంతో మద్యం బాబులకు దేవాలయ పరిసరాలు అడ్డాగా మారాయి. దేవాలయ పరిసరాలైన కళాతోరణం, గ్రామపంచాయతీ ఎదుట, దేవాలయ రోడ్డు వెంట మందుబాబులు మద్యం సేవించి ఖాళీ సీసాలను, వ్యర్థాలను అక్కడే వదిలి వెళ్తున్నారు. అలాగే దేవాలయ స్థలంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనం కూడా మందుబాబులకు అడ్డాగా మారింది. ప్రకృతి వనంలోని చెట్ల కింద ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించి సీసాలను అక్కడే వేసి పోతున్నారు. దీంతో ప్రకృతివనం, దేవాలయానికి వచ్చే భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దేవాలయం పరిసరాల్లో సీసీ కెమరాలు ఉండటంతో మందుబాబులు మద్యం సేవించడానికి భయపడి రాకపోయేవారు. ప్రస్తుతం సీసీ కెమెరాలు చోరీకి గురికావడంతో మందుబాబులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. దేవాలయం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను వెంటనే తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి, దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్ రెడ్డి కోరారు. మద్యం దుకాణాలను దేవాలయానికి సమీపంలో ఏర్పాటు చేయడంతో ఆలయ పవిత్రతకు భంగం కలుగుతుందని పేర్కొన్నారు.



ఆలయ కళాతోరణం పక్కన ఉన్న బీరు సీసాలు



పల్లె ప్రకృతి వనంలో తాగి చిందర వందరగా పడేసిన మద్యం సీసాలు

పార్లమెంట్ ఎన్నికల నియమావళిపై సమీక్ష



తుంగతుర్తిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

తుంగతుర్తి : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, బీఎల్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఫారం–8 ద్వారా ఓటర్లు తమ ఓటును షిఫ్టింగ్ చేసుకోవచ్చని తెలిపారు. 85ఏళ్ల నిండిన ఓటర్లు 12డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకుంటే వారికి బ్యాలెట్ ఓటు కల్పించబడుతుందని అన్నారు. గ్రామాల్లో రాజకీయాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ స్వప్న, ఆయా పార్టీల రాజకీయ నాయకులు తాటికొండ సీతయ్య, మల్లేపాక సాయిబాబు, ఉప్పుల రాంబాబు, అజయ్‌కుమార్, బీఎల్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకం



మద్దిరాల : సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

మద్దిరాల : గ్రామాల్లో ఓటర్ల నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకమైందని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు నమోదు కోసం యువతకు మరోమారు అవకాశం లభించిందని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామారావు, వహీద్, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మద్దిరాల : జి.కొత్తపల్లిలో బోరును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ



నూతనకల్ : యడవెల్లిలో బోరును పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి

మద్దిరాల : గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుక్కడం, చందుపట్ల, జి.కొత్తపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. తాగు నీటి సమస్యలపై ప్రజలతో మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగు నీటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఆయా గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సాధ్యమైనంత వరకు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి కోరారు. బుధవారం నూతనకల్ మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో రక్షిత మంచినీటి బోర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి ఎద్దడి ఏర్పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట అద్దె బోర్లను తీసుకొని నీటిని అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఉన్న పీడబ్ల్యూఎస్ స్కీం బోర్లు, ఓహెచ్ఆర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గుండురావు, పంచాయతీ కార్యదర్శి ఫరూక్, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి



ఐక్య జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

దురాజ్‌పల్లి : జర్నలిస్టులపై ఐఎంఏ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐక్య జర్నలిస్టుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సూర్యాపేటలో శంకర్ విలాస్ సెంటర్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జర్నలిస్టులను నల్ల గొర్రెలతో పోల్చడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. వెంటనే వారి మాటలు ఉపసంహరించుకొని జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ బీఎస్.లతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

రేపాలలో కోలాట పోటీలు ప్రారంభం



కోలాట పోటీల్లో పాల్గొన్న కళాకారుల బృందం

మునగాల : మునగాల మండలంలోని రేపాలలో శ్రీస్వయంభూ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవాలయ కమిటీ చైర్మన్ సారిక చినరామయ్య బుధవారం దేవాలయం ఆవరణలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల నిర్వాహకులు సారిక నాగరాజు, పల్లి సైదిరెడ్డి మాట్లాడారు. మూడు రోజుల పాటు కొనసాగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రూ.500ఎంట్రీ ఫీజును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.20,116లను ఎంపీపీ ఎలక బిందు ప్రకటించగా, ద్వితీయ బహుమతి రూ.15,116లు దేవరగట్ల రామారావు, మూడో బహుమతి రూ.10,116లను పల్లి ఆదిరెడ్డి–రేణుక దంపతులు, నాల్గవ బహుమతి రూ.5,116లను మాజీ సర్పంచ్ పల్లి రమణ–వీరారెడ్డి దంపతులు ప్రకటించారని వారు పేర్కొన్నారు. ఆసక్తి గల కళాకారులు 95028 26769, 95055 33084ను సంప్రదించాలన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరులో బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశువులకు తప్పనిసరిగా ఈ టీకాలను వేయించాలని రైతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ అర్జున్, వీఎల్ఓ కేఎస్ ఎస్.పద్మ, యాకయ్య, గోపాలమిత్రలు ఆల్దాస్ లింగయ్య, కుంభం సురేందర్, అర్జున్ పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



నెమ్మికల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూర్ (ఎస్) : ఓటర్లు శాంతియుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ జి.రవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నెమ్మికల్, గట్టికల్, ఆత్మకూర్ (ఎస్), ఏపూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటర్లు మద్యం, డబ్బులు, ప్రలోభాలకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్ఐ వై.సైదులుగౌడ్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి చెందిన గోళ్ల మహేందర్ కుటుంబ సభ్యులు బుధవారం ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇల్లు లోపల పూర్తిగా కాలిపోయింది. సూర్యాపేట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పేయడంతో చుట్టుపక్కల ఇళ్లకు ప్రమాదం తప్పింది. సుమారు రూ. 4లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు మహేందర్ వాపోయారు. పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్ కాలిపోయిన ఇంటిని పరిశీలించి పంచనామా చేశారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

నడిగూడెం : గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ జి.అజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం నడిగూడెం మండల పరిధిలోని బృందావనపురంలోని ఓ బెల్టు షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే స్థానికుల సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.